నర్సింహగౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, మార్చి 14 : మండలం లోని అప్పరాల గ్రామ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు అక్కల నర్సింహాగౌడ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయినిపేట స్టేజీ వద్ద బస్ షెల్టర్ ఢీకొని మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. గురువారం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకు ముందు నర్సింహగౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, ప్రశాంత్, శంకర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ రావుల

ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ రావుల

వనపర్తి టౌన్, మార్చి 14 : జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో గురువారం మాజీ ఎంపీ రావుల చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హోమంలో పాల్గొని పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల నిర్వాహకులు, పూజారులను సన్మానించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ అలేఖ్య తిరుమల్, నందిమల్ల ఆశోక్, యాదయ్య, బాలయ్య, అమరేందర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, మార్చి 14: మండల కేంద్రానికి చెందిన శ్రీదేవి థియేటర్ యజమాని మొద్దు రామకృష్ణారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్ ఉన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల, మార్చి 14 : జిల్లా ప్రజలు మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యం కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద మాదక ద్రవ్యాలను విక్రయించకుండా పూర్తి నిఘా ఉంచాలన్నారు. ఇందుకు గానూ ప్రతి పాఠశాల, కళాశాలల్లో నలుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో మత్తు పదార్థాలను ప్రజలు వినియోగించకుండా, యువతను మత్తు పదార్థాల నుండి దూరం చేయడానికి వైద్య, విద్య, ఆరోగ్య, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగి ఉండే మందులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన చికిత్సలు చేయించాలన్నారు. క్రాప్ బుకింగ్ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడైనా పంటపొలాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లైతే గుర్తించి వెంటనే సమాచారాన్ని ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాను గంజాయి,మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. సమావేశంలో అధికారులు అరుణ్‌కుమార్, రఫీ, వెంకటలక్ష్మి, రాజు హేమలత, నరేశ్, కమలాదేవి పాల్గొన్నారు.

పోలింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

మాట్లాడుతున్న ఆర్డీవో రాంచందర్

ఆర్డీవో రాంచందర్

ఉండవెల్లి, మార్చి 14: అలంపూర్ నియోజకవర్గంలో తక్కువ పోలింగ్ అయిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆర్డీవో రాంచందర్ సేక్టోరియల్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. 80శాతం కంటే తక్కువ ఓటింగ్ జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించి ప్రజలతో సమావేశాలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేవిధంగా చూడాలన్నారు. 85ఏండ్లు పైబడిన ఓటర్లు, దివ్యాంగులను గుర్తించి వారికి ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకునేవిధంగా ఏర్పాట్లు చేయలని అధికారులకు సూచించారు. 1200మంది ఓటర్ల కంటే ఎక్కువ ఓట్లు ఉన్న కేంద్రాలు గుర్తించినట్లయితే ఎన్నికల నాటికి ఆ పోలింగ్ కేంద్రాలకు అదనపు సిబ్బందిని కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండి వాటిని తరలించేటప్పుడు విధిగా పోలీస్‌లు వెంట ఉండేవిధంగా చూసుకుని ప్రభుత్వ వాహనాల్లోనే స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. పోలింగ్ రోజు ప్రతిరెండు గంటలకు ఒక సారి పోలింగ్ శాతం అధికారులకు తెలియజేయాలన్నారు. సేక్టోరియల్, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

చోరీకి గురైన వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

గద్వాల అర్బన్,మార్చి 14 : చోరీకి గురైన వాహనాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గద్వాల పోలీసులు నిర్మల్ జిల్లాలో పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు జిల్లా కేంద్రంలో ఈనెల 11వ తేదీన అగ్రహారం రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఆవరణలో నిలిపిన బొలెరో క్యాంపర్ వాహనాన్ని అపహరించుకుపోయాడు. ఈ ఘటనపై అసిస్టెంట్ ఇంజినీర్ నాగరాజు ఫిర్యాదు మేరకు..కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ సత్యనారాయణ సూచనలతో ఎస్సై శ్రీనివాస్ విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి వాహనం ఎటువైపు వెళ్లిందో సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలించి కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ రోడ్డుకు వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం జడ్చర్ల, షాద్‌నగర్ మీదుగా హైదరాబాద్ దాటి నాగపూర్ రూట్‌లో వెళ్తున్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి అటువైపు వెళ్లారు. చివరగా నిర్మల్ జిల్లా ఇందల్ వాయ్ టోల్ ప్లాజా దాటినట్లు గుర్తించి పోలీసులను అలర్ట్ చేయగా సోన్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులను గమనించిన దుండగుడు వాహనాన్ని రివర్స్ చేసి వేగంగా వెళ్లి కొంతదూరం ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో వాహనం నిలిపి పరారయ్యాడు. అనంతరం వాహనాన్ని స్వాధీనం చేసుకొని జిల్లాకు తీసుకొచ్చారు.

ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పనిచేయాలి

వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమీక్షకు హాజరైన అధికారులు

వనపర్తి, మార్చి 14: ప్రజాస్వామంపై ప్రజల్లో విశ్వాసం కల్పించేలా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై నోడల్, సెక్టోరియల్ అధికారులు, ఎస్ఎస్‌టీ బృందాలు, పోలీస్ అధికారులు తదితర ఎన్నికల సిబ్బందికి గురువారం ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ రక్షితాకృష్ణమూర్తితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందని నోడల్ అధికారుల తోపాటు అందరూ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమాలి అమల్లోకి వచ్చిన వెంటనే తొలి 24, 48, 72 గంటల్లో తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో నోడల్ అధికారికి సంబంధించిన విధులు వారి బాధ్యతలను వివరిస్తూ ప్రొజెక్టర్‌పై అవగాహన కల్పించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాకారులకు సూచించారు. ఓటు ప్రాధాన్యత , ఓటు హక్కుపై స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, పోస్టల్ బ్యాలెట్ అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవీఎంల తరలింపు, అదేవిధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, పోలింగ్ సిబ్బందికి కావాల్సిన వాహనాల కేటాయింపు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. నోడల్ అధికారులందరినీ జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షిస్తారని, ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ అంశంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా బెల్ట్ షాపుల విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. బైండోవర్ కేసుల అంశంలో అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్, డీఎఫ్‌వో నవీన్, ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నోడల్, సెక్టార్, ప్లయింగ్ , విజిలెన్స్, వీడియో బృందాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ ధాన్యాన్ని పూర్తి చేయాలి

వనపర్తి,మార్చి 14: జిల్లా నుంచి రైస్ మిల్లర్లు కేంద్ర ఆహార సంస్థతో పాటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు అందించాల్సిన పెండింగ్ సీఎంఆర్ ధాన్యాన్ని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోరైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, పౌరసరఫరాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2020-21, 21-22 ఏడాదిలో వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన పెండింగ్‌లోన్న 430ఏసీకేల ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖకు అందించే ప్రక్రియను వేగవంతంగా చేయాలన్నారు. అలాగే 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న 546 ఏసీకేల ధాన్యాన్ని కేంద్ర ఆహార సంస్థకు అప్పగించాలన్నారు.2023-24 వానకాలం సీజన్‌కు సంబంధించి 71రైస్ మిల్లర్లు 4,418 ఏసీకేల ధాన్యాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

రూ.5లక్షలు చోరీ

అలంపూర్, మార్చి 14: బ్యాంక్‌లో నగదు డ్రా చేసుకుని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టిన రూ.5లక్షల నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన అలంపూర్‌లో గురువారం చోటు చేసుకున్నది. సీఐ రావిబాబు కథనం మేరకు.. మండలంలోని గొందిమల్లకు చెందిన వెంకటేశ్వర్లు గురువారం ఎస్‌బీఐలో రూ.5లక్షల నగదు డ్రా చేసుకుని తన బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకుని కూరగాయలు కొనడానికి వెళ్లగా.. పక్కా ప్రణాళికతో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు రూ.5లక్షలు చోరీ చేశారు. వెంటనే నగదును పరిశీలించగా, కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బొలెరో ఢీకొని బాలుడి మృతి

అలంపూర్, మార్చి 14: అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురం వద్ద గురువారం రాత్రి బొలెరో ఢీకొని బాలుడు (7) మృతిచెందిన ఘటన చోటు చేసుకున్నది. ఇమాంపురం గ్రామానికి చెందిన మౌనిక, రాంబాబు కుమారుడు మహోదయ్ (7) కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డుపై వెళ్తున్న బొలెరో ఢీకొన్నది. ఘటనలో బాలుడికి బలమైన గాయాలుకాగా, అలంపూర్ సీహెచ్‌సీకి తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

గణిత శాస్త్రవేత్తల కృషి మరువలేనిది

మల్దకల్, మార్చి 14 : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం క్రాంతికుమార్ అధ్యర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గణిత శాస్త్ర వేత్తలు అయిన ఆర్కిమెడిస్, ఆర్యభట్ట చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శుభ, భాస్కర్, జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు వకుళమాలిక, మణెమ్మ, వరలక్ష్మి, సుహాసిని, జ్యోతి, షకీల్, జములమ్మ పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంచాలి

పాన్‌గల్, మార్చి 14: విద్యార్థుల బోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా 6వ, 8వ తరగతి విద్యార్థుల తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్థుల బోధనా సామర్థ్యాలు పరీక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎర్రవల్లి చౌరస్తా, మార్చి14: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ పేర్కొపారు. గురువారం ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్, కేంద్ర బాలగాల ఆధ్వర్యంలో ఎర్రవల్లి చౌరస్తా, వసంతనగర్, శ్రీనివాస నగర్, అరుంధతి కాలనీ, కల్కిభగవాన్ నగర్, పాతఎర్రవల్లిలో మిలటరీ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలకు ఎలక్షన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని, గ్రామాల్లో మద్యం విక్రయించరాదని, ప్రజలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దని సూచించారు.

వైద్యశాఖ ఆరోపణలపై విచారణ

వనపర్తి,మార్చి 14 : జిల్లా వైద్యారోగ్యశాఖపై వస్తున్న అధికార దుర్వినియోగం, అడ్డగోలు చెల్లింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖపై వస్తున్న కథనాలు, ఫిర్యాదులపై డిప్యూటీ డీఎంహెచ్‌వో, సిబ్బందిని పిలిపించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు పత్రికల్లో వస్తున్న కథనాలపై వెంటనే విచారణ చేపట్టాలని, వైద్యారోగ్యశాఖకు వచ్చిన మొత్తం నిధులు, ఖర్చు చేసిన వివరాలతో కూడిన నివేదికను మూడు రోజుల్లో అదనపు కలెక్టర్‌కు అందజేయాలని ఆదేశించారు. అలాగే ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి పూర్తి వివరాలతో నివేదికను అందజేయాలని కోరారు.

బాల్యం నుంచే నైతిక విలువలను పెంపొందించుకోవాలి

డీఈవో గోవిందరాజులు

మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

పెద్దమందడి, మార్చి 14 : విద్యార్థులు బాల్యం నుంచే నైతిక విలువలను పెంపొందించుకోవాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. గురువారం మనిగిల్ల ఉన్నత పాఠశాలలో జరిగిన విలువల విద్య మేళా కార్యక్రమానికి జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటరమణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన జీవితాన్ని విద్యార్థులు చిన్నప్పటి నుంచి అలవర్చుకోవాలని సూచించారు. ప్రాచీన వ్యవస్థకు ఆధునిక వ్యవస్థకు గల తేడాను తెలుపుతూ మనిషి కోల్పోతున్న విలువలను గుర్తు చేసేవిధంగా విద్యార్థులు తమ విషయ సేకరణను చేశారని కొనియాడారు. అందుకు ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్‌గౌడ్, ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్ఎం చంద్రశేఖర్, గణేశ్‌కుమార్, మద్దిలేటి, ఆర్డీఎస్ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, కవులు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, ఉపాధ్యాయ సంఘం నాయకులు మహిపాల్‌రెడ్డి, సూర చంద్రశేఖర్, వరప్రసాద్‌గౌడ్, శోభారాణి, పోచ రవీందర్‌రెడ్డి, సాక్షారభారత్ కో-ఆర్డినేటర్ శ్రీవాణి, సుమ, శ్రీలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పక్కా ప్రణాళిక

మాట్లాడుతున్న చిన్నారెడ్డి

- నిలిచిన పనులను పూర్తిచేస్తాం
- భేషజాలు లేకుండా ముందుకు వెళ్తాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి, మార్చి14(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టి చివరి దశలో మిగిలిన పనులను ఎలాంటి భేషజాలకు తావులేకుండా పూర్తి చేస్తామన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిన్నారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాపరంగా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని అభివృద్ధికి శ్రీకారం చుడతామని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిలిచిన పనులన్నింటికీ కూడా పూర్తిగా బాధ్యత తీసుకుంటామని చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజావాణి బాధ్యతలను కూడా తనకు అప్పగించడంతో మరింత బాధ్యత పెరిగిందని, వచ్చే దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. వనపర్తిలో చివరి దశలో మిగిలిన రోడ్డు విస్తరణ, టౌన్ హాల్, ఇండోర్ స్టేడియంలాంటి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని, అలాగే మంజూరై ప్రారంభానికి నోచుకోని పనులు ఐటీ టవర్, బైపాస్‌రోడ్డు, పాలిటెక్నిక్ భవనంలాంటివన్నీ కొత్తగా నిర్మాణాలు జరిగేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఫారెస్ట్ యూనివర్శిటి, రైల్వే లైన్, పరిశ్రమల కేంద్రంలాంటి వాటిని మంజూరు చేయించేలా ప్రయత్నం చేస్తానని, గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన నిరంజన్‌రెడ్డితో పెండింగ్ పనులపై తాను మాట్లాడానని, వనపర్తిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చిన్నారెడ్డి చెప్పారు. సమావేశంలో నాయకులు కిరణ్‌కుమార్, అక్తర్, బి కృష్ణ, కమ్మర్‌మియా, పెంటయ్య, రాగి వేణు, కదిరే రాము, ఎండీ బాబా తదితరులున్నారు.

కొత్తరకం వంగడాలను రూపొందించాలి

మాట్లాడుతున్న డాక్టర్ మల్లారెడ్డి

మదనాపురం, మార్చి 14 : మారుతున్న కాలాన్ని బట్టి రైతులకు కొత్తరకం వంగడాలను పరిచయం చేయాలని డాక్టర్ మల్లారెడ్డి(ఏడీఆర్, ఆర్ఎఆర్ఎస్) అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ రైతులు నూతన సాంకేతిక పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం కేవీకే హెడ్ ఖోగరే 2023 ఏడాదిలో కేవీకే తరపున చేసిన కార్యక్రమాలను శాస్త్రీయ సలహా మండలి వేదికగా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సవిత ప్రొఫెసర్ (పీజేటీఎస్ ఏయూ), జిల్లా అధికారులు వనపర్తి ఏడీఏ దామోదర్ , నారాయణపేట డీఏవో సుధాకర్, గద్వాల డీఏవో గోవింద్ నాయక్, గద్వాల డీహెచ్ఎస్‌వో అక్బర్ , కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

గద్వాలటౌన్, మార్చి 14 : ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. చివరి రోజు కేంద్రాలను ఇంటర్ జిల్లా నోడల్ అధికారి హృదయరాజు పర్యవేక్షించారు. గురువారం నిర్వహించిన సెకండియర్ పరీక్షకు 3,559మంది విద్యార్థులకు గానూ 3,438మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన విద్య, పోలీస్, విద్యుత్,మున్సిపల్, ఆర్టీసీ శాఖల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, మార్చి 14 : మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. సెకండియర్ పరీక్షకు 63మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

వనపర్తి జిల్లాలో..

వనపర్తి టౌన్, మార్చి 14 : ఇంటర్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా సెకండియర్ కెమిస్ట్రి, కామర్స్ పరీక్షలు కొనసాగగా 5906మంది విద్యార్థులకు గానూ 5,721 మంది హాజరు కాగా 185మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,994మందికి గానూ 4,847మంది హాజరు కాగా 147మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 912మందికి గానూ 874మంది హాజరు కాగా 38మంది గైర్హాజయ్యారు. ఒకేషనల్ పరీక్షలు యథావిధిగా కొనసాగనున్నాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల రూరల్, మార్చి 14 : మండలంలోని ఈడిగోనిపల్లి గ్రామంలో గురువారం ఉదయం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. గద్వాల రూరల్ ఎస్సై పర్వతాలు కథనం మేరకు గ్రామానికి చెందిన రాముడు(40) గ్రామంలోని ఒక హోటల్‌కు ఉదయం వెళ్లాడు. హోటల్‌లో ఉండే ఫ్యాన్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ దవాఖానకు చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు .పార్టీ మంచి కార్యకర్తను కోల్పోవడం బాధకలిగించిందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

గద్వాలటౌన్, మార్చి 14 : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా నేరమని అలా చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బస్తీద వాఖానలో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హోమియోపతి, సిద్ధ, యునాని, నాచురోపతి, హోమియోపతి, ఆయుర్వేద దవాఖాన నిర్వహించే వారు వైద్యులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రైవేట్ దవాఖాన నిర్వాహకులు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

గద్వాలటౌన్, మార్చి 14 : అనుమానిత వ్యాధిగ్రస్తులను వెంటనే గుర్తించి ప్రభుత్వ దవాఖానకు రెఫర్ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప అన్నారు. జిల్లాకేంద్రంలోని కాలనీలో గురువారం కుష్ఠువ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. స్పర్శలేని గోధుమ రంగు మచ్చలు ఉంటే అనుమానిత కుష్ఠువ్యాధిగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో మల్లికార్జున్, పీవో ఎన్ఎస్‌డీ రాజు, ప్రేమ్‌సాగర్, నర్సమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

అయిజ, మార్చి 14: ఉన్నత విద్యలో రాణించేందుకు కృషి, పట్టుదలతో చదివి ఉత్తీర్ణత సాధించాలని ఎస్సై విజయ్ భాస్కర్ సూచించారు. గురువారం పట్టణంలోని శ్రీకృష్